# తరంగాలు! ---

రచన: శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ

చల్లని సాయంకాల సమయం! దూరంగా పెద్ద కాలువ మీదనుంచి వచ్చే చల్లనిగాలి శరీరానికి చక్కిలిగింతలు పెడుతోంది. ఏపుగా పెరిగిన పొలాలు చూస్తే పరవశత్వం కలుగుతోంది. సాయంకాలపు ఎండ అందంగా చెరుకుతోటల్లోని గోడలమీద పడి ప్రతిఫలిస్తోంటే చూడ ముచ్చటగావుంది. తల్లి తండ్రి కోరికపై రమేష్ దీపావళి పండుక్కి స్వగృహానికి వచ్చాడు. ఈ సంవత్సరమే తన కింక రీసెర్చి ఆఖరవుతుంది. పది వసంతాలనుంచి తను ఈ పల్లెటూరు అసలు చూడనేలేదు. ఎస్సెల్సీ పూర్తయినప్పటినుంచీ తను వాల్తేరులోనే వుంటూన్నాడు. తమకి హిమాలయా పర్వతంలాగ తరగని ఆస్తి వుంది. తన తండ్రికి ఆగ్రామంలో ప్రత్యేక గౌరవమూ, హోదా, సంఘంలో ఉన్నత స్థానమూ. వుంది తన తండ్రికి యింత ఆస్తి వున్నా అది ఇతరుల చేతికిచ్చి వదలడు. తన తండ్రే స్వయంగా వ్యవసాయం చేయిస్తాడు. ఈ పల్లెటూరు వదలడమంటే తన తండ్రి గట్టున పడేసిన చేపలా గిలగిల్లాడ్తాడు! అందుకు కారణమేమిటో ఇన్నాళ్లూ రమేష్ గుర్తించలేక పోయాడు. కాని......కాని ఇప్పుడు తెల్సుకొంటున్నాడు.

"రమేషూ! ఒక్కసారి మనచెరుకుతోటలోకి వెళ్లి మీ నాన్నగారిని ఇంటికి పంపించు! ప్రొద్దుట నుంచి ఆయన భోజనం చెయ్యలేదు......" అన్న తల్లి పిలుపుతో ఇంటినుండి చెరుకుతోట వైపుకి దారితీశాడు రమేశం.

చెరుకు తోటలో !......

ఒక వైపునుంచి చెరుకు గెడలు కట్టలుకట్టి మోసుకు వస్తున్నారు! మరొక జట్టువారంతా అవి గానుగులో వేసి రసాన్ని తీస్తున్నారు. ఇంకొక తెగ వారంతా ఆ తీసిన చెరుకు రసాన్ని బెల్లంవండే పొయ్యి దగ్గరకు తీసుకు వస్తున్నారు. ఆ తెచ్చిన రసాన్ని నల్గురు అందుకొని పొయ్యిమీది పెనంలో పోస్తున్నారు. ఇద్దరు ఎండిన చెరుకు పిప్పిలు పొయ్యిలో వేసిమంటలు వేస్తున్నారు......మరో ఇద్దరు చెరుకు పాకంలో తెడ్లుపెట్టి కలియ త్రిప్పుతున్నారు......

రమేష్ చెరుకు పొయ్యిదగ్గరకి వచ్చాడు. రమేష్‌ని చూడగానే అక్కడి కూలీలంతా ఎక్కడి వాళ్లక్కడే మాన్పడి నిల్చుండి పోయారు. కాని పెనంలో చెరుకు పాకాన్ని తెడ్డుతో కలియబెడ్తూన్న రాజమ్మ మాత్రం రమేష్‌ని చూచీకూడా చూడనట్లే తన పనిలో లీనమై పోయింది. కూలీలంతా ఒకేవైపు దృష్టి నిల్పి నిల్చుండి పోవడంతో రమేష్ తండ్రి నాగేంద్రం ఆశ్చర్యంగా అటుచూచాడు. తన ఏకైక పుత్రుడు రమేశం!

"అబ్బాయి రమేశం!...వీళ్లంతా మనమేలు కాంక్షించే వాళ్లురా అబ్బాయీ! నిన్ను చూడాలని అయిదేళ్ళనుంచి ఉవ్విళ్లూరు తున్నారు!...అదిగో! మన రత్తికూతురు రాజి! పెద్దది అయ్యాక రాజీ అంటే దెబ్బలాడి 'రాజమ్మ' అని పిల్పించు కొంటోంది" అని కొడుక్కి అందర్నీ పరిచయం చేసాడు నాగేంద్రం.

"పిలకలా జడేసుకుని సింగిరిక్కి బుచ్చిలా అల్లరి చేసే రాజీ అప్పుడే ఇంత పెద్దదై పోయిందా?..." ఆశ్చర్యంగా అడిగాడు రమేష్.

రమేశం మాటకి రాజమ్మ నఖశిఖాగ్రం పొంగిపోయింది. ఒక్కసారి తలను ఇటు త్రిప్పి రమేశ్ కెంహం లోకి సూటీగా చూచింది. ఆ చూపుల్లో రమేశం చూపులు కూడా కలిసిపోయి చిన్న నవ్వులతో ముఖాలు పల్కరించు కొన్నాయ్.

రమేశం మనస్సులో గతం తిరుగుతోంది. తను రాజీ కల్సి జట్టాపట్టా వేసుకుని బళ్ళోకి వెళ్లేవారు. గొల్ల స్థంభాలాటలు, దాగుడు మూతలు, పచ్చాకు భైరాకు ఆటలు, వెన్నెల పరుగులు...ఎన్నో ఎన్నో ఆడుకునేవారు, తను ఇంటి దగ్గర వుద్నంత సేపూ 'రాజీ' అని పిలిస్తే ఊరుకొనేది; కాని బడిలో మాత్రం "రాజ్యం" అని పిలిస్తేనే పలికేది.

ఒక రోజు రమేశం తల్లి...అబ్బాయీ! నువ్వు

శ్రీమంతుల బిడ్డవి; యస్సెల్సీ చదువుతున్నావు. నీకా ముష్టి దానికూతురితో సావాసం ఏమిట్రా? ఇంక ఆరాజీతో చనువుగా తిరగొద్దు'' అంది.

''అమ్మా! రాజీ చాలా మంచిదే! ఆ అమ్మాయి దగ్గరగా లేకపోతే నేను చదువుకోలేనే!...'' అన్నాడు రమేశం.

తల్లి గ్రుడ్లెర్రజేసి ''ఏడిసినట్లే వుంది నీ తెలివి? అబ్బెవడో; కులం ఏమిటో; గోత్రమేమిటో తెలీని ఆ దరిద్రురాలితోనా నీ స్నేహం? ఇంక ఆరాజీ ప్రక్కన నువ్వు కన్పించావంటే ఏం చేస్తానో చూడు...'' అని బెదిరించింది.

తల్లి కాళికావతారానికి తను నదరక బెదరక నిలబడి ''అమ్మా! మనకు ధనముంది; వారికి గుణముంది. సుగుణవంతులైన వారికి కులగోత్రంతో పనేముందమ్మా?'' అన్నాడు రమేశం.

చాటున నిల్చుని తండ్రి నాగేంద్రం ఈ మాటలన్నీ విన్నాడు. మొగ్గలోనే కొడుకు భావాల్ని త్రుంచెయ్యాలని ఎదుటికి వచ్చి ''రమేశం! దిక్కూ మొక్కూ లేని దీనురాలై మన పంచనిచేరి మనకి నౌఖరీచేసే దాని కూతురు ఆరాజీ. యజమాని బిడ్డకీ, దాసీబిడ్డకీ, భూమ్యాకాశాల కున్నంత దూరం! నెయ్యానికి ఎప్పుడూ సమాతిలే వుండాలి కాని మన అంతస్థుకు చాలని వాళ్ళతో సహవాసం చాలా ముప్పు - నక్కెక్కడ? నాగలోక మెక్కడ? దానితో నీకు చెలిమా?'' అని గద్దించాడు తండ్రి.

ఆదేసమయంలో పలకాపుస్తకాలు తీసుకొని రాజ్యం అక్కడికొచ్చి ''రమేశం! బడిటైమ్ అయిపోతోందిరా! పోదాం॥'' అంది.

''మావాడింక నీతో రాడే! ఇంక మళ్లావాడితో నువ్వు మాట్లాడావంటే పళ్లు రాలగొడ్తాడు'' అంది రమేశంతల్లి.

ఈ మాటలు ప్రతిరోజూ రాజీ రమేశులకి అలవాటే!. అప్పటికి రెండేళ్లనుంచి వాళ్లిద్దర్నీ విడదియ్యాలని విశ్వప్రయత్నాలూ చేస్తున్నారు ఆ తల్లి తండ్రులు. కాని రమేశం ఎన్నడూ రాజీని పల్లెత్తు మాటనలేదు. కాని ఆరోజు...రమేశం నిద్రనుంచి లేచింది మొదలు తల్లి తండ్రీ కూడా ఒక్కవరస తనని వేధిస్తున్నారు. కాని పోరు పడలేక వాళ్లు చెప్పినట్లుగా ''రాజ్యం! నువ్వు మా కూలిదాని కూతురివి. నీతో నేనింక స్నేహంచెయ్య దలుచుకోలేదు'' అనేశాడు చిరాగ్గా రమేశం.

''అయితే సరే ఇంక నువ్వు పిల్చినా నేనురానులే!'' అంటూ కరుగ్గా అనేసి చురుగ్గా మెట్లు దిగి గిర్రున వెళ్లిపోయింది రాజీ.

ఆ రాత్రి రత్తమ్మ తను యింటికివచ్చి ''అయ్యగారు! మేము ఈ ఊరువదలి వెళ్లిపోతున్నాం. శలవండి...'' అంటూ తన తల్లికీ తండ్రికీ చెప్పడం రమేశు విన్నాడు. తనువెళ్లి రాజం వెళ్లకుండా ఆపుచెయ్యాలని చీకట్లో వాళ్లింటికి వెళ్లాడు. ''రాజీ'' అనిపిల్చాడు. కాని రత్తమ్మ బయటకి వచ్చి ''అబ్బాయిగారూ! మా రాజి మీద మీకు అసహ్యత కల్గాక ఇంక ఇక్కడ వుండకూడదని అన్నమైనా తినకుండా కూర్చుందండి. ఇల్లా లోపలికిరండి.''

రాజ్యంను ఎల్లాగైనా మాట్లాడించాలని విశ్వ ప్రయత్నాలు చేశాడు రమేశు. కాని రాజ్యంకు కోపంతగ్గలేదు. ''మీ అమ్మా నాన్న చేత నీచేత మాటలు పడ్తూ కూర్చోడానికి మేము నీతి నియమాలు లేని వాళ్లం కాము! మాకూ ధనం లేకపోయినా మానాభిమానాలు, పౌరుషం వుంది. బయటకునడు!'' అంది రాజీ మహాదురుసుగా.

''నేనిక్కడ నుంచి కదలను'' మొండి కేసాడు రమేశం.

''కదుల్తావా? లేదా?'' అని లేచినిల్చుని అడిగింది రాజ్యం.

''నిన్ను వెళ్లనివ్వకుండా నేనిక్కడే వుంటాను'' పట్టుదలగా అన్నాడు.

మాటమీద మాట పెరిగింది. రాజ్యం కోపంతో రెచ్చిపోయి బందులు లేని బోడి పలకతో రమేశును నుదురుమీద కొట్టింది. బొట బొటా రక్తం ధారగా కారిపోతోంది. సరిగ్గా అదే సమయంలో నాగేంద్రం అక్కడికొచ్చాడు. కావల్సినంత రభసచేసాడు. చిట్టచివరకు రత్తమ్మ తన కూతురు రాజమమ్మను తీసుకొని ఊరు విడిచి వెళ్లిపోయింది. రమేశం నుదురుకు డాక్టరు చేత కట్టు కట్టించి యింటికి తీసుకు వెళ్లారు.

రాజీలేని ఆ ఊళ్ళో క్షణం కూడా వుండకలేక పోయాడు రమేశం. చూస్తూండగా దుక్కలాంటి రమేశు

బక్కచిక్కిపోయి బెంగెట్టుకున్నాడు. ఎల్లాగో ఎస్సెల్సీ పరీక్షలు పూర్తి చేసాడు రమేశం. కాని రత్తమ్మ, రాజీ ఎక్కడికి వెళ్ళారో; ఏమయ్యారో; వాళ్ళ జాడ కూడా తెలియలేదు. ఇంటర్ చదువుకి వాల్తేరు వెళ్ళాడు. అప్పటి నుంచీ హాస్టల్‌లోనే వున్నాడు. శలవుల్లో కొత్త కొత్త ప్రదేశాలు చూచిరావటానికి దేశయాత్రలకి బయల్దేరేవాడు. తన ముఖంమీద రూపాయి అంత మచ్చ—రాజీ కొట్టిన దెబ్బ మాయని మచ్చగా—చెరగని ప్రేమ చిహ్నంలా—స్నేహరూపాని గుర్తుకు తెస్తూ అల్లాగే నిల్చిపోయింది నుదురుమీద - అందుకే ఈనాడు రాజమ్మను చూచే సరికి అంతా సినిమా రీళ్ళ మాదిరి గతం గిర్రున తిరిగింది.

రాజ్యం కూడా ఒళ్ళంతా కళ్ళు చేసుకొని రమేశంను నఖశిఖ పర్యంతం చూచింది. అయిదు వసంతాల క్రిందట నాగేంద్రంగారి భార్యకు జబ్బుచేసి, ఆ జబ్బులోనే మశూచికం వచ్చింది. ఆ అమ్మవారికి జడిసి ఎవరూ ఆవిడదగ్గరకి చేరలేదు. ఇంక గంటకో ఘడియకో ఆవిడ చచ్చిపోతుందన్న వార్త మూడు గ్రామాల కవతల వున్న రత్తమ్మ చెవిని పడింది. కాళ్ళకు రెక్కలు మొలిచినట్లుగా కూతుర్ని తీసుకు పరుగెత్తుకు వచ్చి నాగేంద్రంగారి యింట్లో వాలింది. నాగేంద్రంగారి భార్య భూదేవికి చెయ్యరాని సేవలు చేసి తమ యావశ్శక్తిని ధారపోశారు ఆ తల్లీ కూతురు. వాళ్ళ సేవ ఫలించి భూదేవి పునర్జన్మ ఎత్తినట్లుగా జీవించింది. ఆనాటి నుంచీ రత్తమ్మను రాజమ్మను తమ యింటినుంచి కదలవద్దంది. అయినా రాజమ్మ ఆత్మాభిమానం గలవ్యక్తి. వారింటికి దూరంగా వేరే యింటిలో కాపురం వుంటూ కాయ కష్టంతో తమ ఉదర పోషణ చేసుకొంటున్నారు. ఇన్నాళ్ళకి తన బాల్య మిత్రుడు కన్పించే సరికి ఒక్కసారిగా చిన్ననాటి చిలిపి చేష్టలు... బాల్య స్నేహంలోని మధురిమను, ఆనాటికి ఈనాటికీ కల్గిన పరిణామం... మనస్సులో మెదిలే భావాలకు రూపమిచ్చి అతని పట్ల తన కృతజ్ఞతను వక్తం చెయ్యాలను కొంది రాజ్యం. ఎదలో కదిలే ఊహాలకు, స్నేహాను రాగాలను గానం చెయ్యాలను కొంది రాజీ! కాని...కాని...తను కూలిదాని కూతురు! కులంలేని పిల్ల!! నిరుపేద!!! అన్న సంగతి గుర్తుకొచ్చే సరికి పచ్చి వెలక్కాయ గొంతుకలో అడ్డుపడ్డయింది.

ఆ నాటి రమేశం మాటలు జ్ఞప్తికి వచ్చి చటుక్కున తల త్రిప్పేసింది.

"రమేశం! అల్లాగే నిల్చుండి పో వేం? అదుగో అక్కడ బెల్లం గది దగ్గర కుర్చీవుంది అందులో కూర్చో" అనే నాగేంద్రంగారి మాట విన్పించే వరకూ రాజీ రమేశులకు బాహ్యస్మృతి లేదు.

"నాన్నగారూ! మిమ్మల్ని బోజనానికి రమ్మంది అమ్మ..." అని వచ్చిన పని నివేదించాడు రమేశం.

ఇప్పుడు ఈ బట్టీ పూర్తయ్యేవరకూ నేను కదలదల్చుకో లేదు. మళ్ళా రేపు మీ మామయ్య వస్తే అసలు నేనిక్కడికి రావటానికే వీలుండదు. ఇది పూర్తయ్యాక ఇంటికి వెడ్తాలే!..." అంటూ నాగేంద్రంగారు తన పనిలో లీనమయ్యాడు.

రమేశు అక్కడే నిల్చుని రాజమ్మ చేస్తున్న పనిని, ఆమెయొక్క......తనివితీరా చూస్తున్నాడు.

మనిపూసిన మాణిక్యం వలె మెరిసి పోతోంది రాజ్యం. రమేశు ఇంత వరకూ కాలేజీల్లో ముస్తాబైన అమ్మాయిల్నే చూచాడు కాని సహజ సౌందర్యవతులైన నిరాడంబర అమాయిక యువతుల్ని చూడలేదు. నవనాగరిక శ్రీమంతుల యువతుల్లా సిల్కుచీర, జార్జెట్ జాకెట్టు, రెండుజడలు, మెడలో రాళ్ల నెక్లసు, ఎడంచేతికి రిష్టు వాచ్, కుడిచేతికి బంగారు గాజులు, వేళ్లకు రాళ్ల ఉంగరాలు, కాళ్లకు లేడీబూటు రాజ్యంకు లేకపోయినా అపర సౌందర్యరాశిలావుంది. రూపంలోనూ, లావణ్యంలోనూ, సౌందర్యంలోనూ, ఉత్సాహంలోనూ, ఆమె చేస్తూన్న పనిలోని శ్రద్ధాసక్తులూ చూస్తూంటే రమేశుకి పరవశత్వం కల్గుతోంది. రమేశు భావోద్యానంలో వలపుపూవులు ... తలపుతావులు ... నరనరాల్లోనూ ఆనందతరంగాలు...

చెరుకు పాకం పొయ్యిమీది పెనంలో ఉడుకుతోంది, రాజ్యం బాగాకలియ త్రిప్పుతోంది. పుసుకు వేడి ఆవిరికి రాజ్యం ముఖం మీద నుంచి చెమటలు ధారగా కారిపోతున్నాయ్. శరీరమంతా స్వేద స్నానం చేసినట్లుగా చీరకూడా తడిసి ముద్దయి శరీరానికి అతుక్కుపోయింది. తనవైపే ఏకదీక్షగా రెప్పవాల్చకుండా చూస్తోన్న రమేశుని చూచేసరికి సిగ్గుతో మల్లెమొగ్గలా ముదుచుకు పోతోంది రాజ్యం! అతడు తనని చూచి

Telegram : "LITHOGRAPH" Telephone : 58 & 75

**THE NATIONAL LITHO PRESS**

(Estd. 1933)

RAILWAY FEEDER ROAD, Post Box No. 30 SIVAKASi, (S.I)

దక్షిణ భారతంలో ఖ్యాతిగాంచిన ముద్రణాలయం !!

## ది నేషనల్ లితో ప్రెస్ – శివకాశి.

నిపుణులైన పనివారలచే, మా ప్రెస్‌లో అందమైన విధంగా అగ్గి పెట్టె, బీడి, మిల్, సోప్, ఫైర్ వర్క్స్, బట్టలు, కాఫీ, టీ, మిఠాయి, సోడా, మొదలయినవాటికీ కావలసిన లేబిల్సు, మరియు పెట్టెలు, లితోలోను, ఆఫ్ సెట్ లోను అచ్చువేసి ఇవ్వబడును. చిత్రాలుగల కాలెండర్లు "ఫొటో ప్రాసెస్" మూలంగాను ఆఫ్ సెట్ పద్ధతిలోనూ తయారుచేసి ఇవ్వగలము

ఆకర్షణీయమైన పలురంగులలో, పువ్వుల బార్డర్లలో పల వివాహమహోత్సవాహ్వాన పత్రికలు రెడీమేడ్ గా మావద్దనున్నవి.

ముద్రణాలయములకు కావలసిన లితో, ఆఫ్ సెట్ ఇంకులకు

## గిరిశెన్ ప్రింటింగ్ ఇంక్ ఫ్యాక్టరీ - శివకాశి,

వారికి వ్రాయండి.

చిరునవ్వు నవ్వేసరికి... సిగ్గు స్త్రీకి సహజాలంకారం గదా! అందులోనూ వయస్సు వస్తూన్న రాజ్యంకు— బంగారానికి పూత పూసినట్లు... చంద్రకాంతికి కలువ రేకులు విచ్చుకొన్నట్లుగా ఆమె ముఖం ఆనందతో విప్పారినా నవయువ్వన సుందరుడైన రమేశుని చూచి సిగ్గుతో సిరస్సు వంచి తన పనిలో లీనమై పోతోంది రాజ్యం.

బెల్లం పొయ్యిదగ్గర పని పూర్తిచేయించి అంతా జాగ్రత్తగా గదిలో పెట్టించి తాళం వేయించి యింటికి బయల్దేరాడు నాగేంద్రం. రత్తమ్మ, రాజ్యంవచ్చి "బాబయ్యా! ఆపెద చాపలో బెల్లపు అచ్చు మర్చి పోయారండి" అని చెప్పడంతో మళ్ళీ వెనక్కి తిరిగాడు...రత్తమ్మ నాగేంద్రంగారు బెల్లం కొట్టు గది వైపుకు వెళ్ళారు.

దూరంగా నిల్చున్న రమేశం రయ్‌న, హిమాలయా శిఖరాగ్రం నుంచి ప్రళయకాల రుద్రునిపలె మహాప్రళయంగా దూకుతోన్న జలరాశిలా మనోవేగంతో నాలుగంగల్లో రాజ్యం దగ్గరకి వచ్చి నిల్చున్నాడు. శివ జటాజూటంలో సేదదీరి రాయంచవోలె పనిచేసి చేసి అలిసి పోయిన రాజ్యం మైదానాల్లో సాగే గంగా భవానిలా మందమందంగా అక్కడే నడయాడ్తోంది. రమేశుని చూచిన రాజీ ఒక్కసారిగా అభిసారికై పోయింది. కాని ఆనాటి చివరి మాటలు - రమేశు మాటలు గుర్తొచ్చి అపర సత్యభామలా నిల్చుంది రాజీ.

"రాజ్యం!" దగ్గరగా వచ్చి నిల్చుని పలకరించాడు రమేశం. తలెత్తి రమేశం వైపు దృష్టి సారించింది రాజీ.

రమేశు హృదయం గంగా నదిలా ఉప్పొంగి పోయింది.

"రాజీ! నిన్ను నేను జీవితంలో ఎన్నటికీ మర్చిపోను! మర్చిపోలేను!! నువ్వు మరువు రావు!!!" అని ఆమె చెయ్యి పట్టుకొన్నాడు.

రాజ్యం చెయ్యి విదలించుకొని, కళ్ళు చిట్లించి, ముఖంలో చిరుకోపం మొలిపించి గొంతులో సత్కార భావం తొణికిస్లపచేస్తూ "రమేష్! నువ్విప్పుడు చిన్న

వాడివి కాదు...శ్రీమంతుల బిడ్డవి; కూలిదాన్నని నన్నంత నీచంగా భావించ వనుకొంటా! నువ్వొక యజమానివి; నేనొక పేద పిల్లను—"

"రాజీ! నిన్ను నేనొక పేద పిల్లలా భావించడం లేదు. మిత్రురాలిగా..."

"మన అంతస్థులు దూరం రమేష్!..."

"ఆత్మీయతా మైత్రికి అంతస్థులు అడ్డొస్తాయా రాజీ?

"పెద్దల పెర్మిషన్ మీద ఆధారపడే వీరికి వాళ్ళ స్వతంత్రించి స్నేహానికి అనర్హులు రమేశ్!"

"అనాటి కోపం ఇంకా పోలేదా రాజ్యం?"

"రమేశ్! అదే నా బాల్య జీవితంలో మరుపురాని మనోగాయం! అది నా బ్రతుకనే మార్చివేస్తిది"

"రాజీ! ఆనాటి నీ దెబ్బ అనుదినం నిన్ను తల్చుకొనేటట్లు చేసింది.''

"రమేశ్! ఇప్పుడెందుకు ఆ మాటలు?... మేము మీతండ్రిగారి పొలంలో పనిచేసే కూలీలం! ఇంక నువ్వు నాతో మాట్లాడవద్దు—అనాటి నా తప్పిదానికి, కొట్టిన దెబ్బకి ఈ నాడు క్షమార్పణకోరు కొంటున్నా! నన్ను క్షమించు రమేశ్! అని తలవొంచింది రాజీ.

అదే సమయంలో "అబ్బాయ్! రా రాపోతాం!!" అంటూ తండ్రి రావడంతో విధిలేక కదిలాడు రమేశ్.

"నాన్నగారూ!" నడుస్తూన్న రమేశు ఠక్కున ఆగి పిల్చాడు.

"ఏం?" అన్నట్లు చూచాడు నాగేంద్రం.

"రాజీకి పెండ్లి అయిపోయిందా?..."

"లేదురా! దాన్నెవడు మనువు చేసుకుంటాడు?" అన్నాడు అసహ్యతగా చూస్తూ.

'అదేం? రాజ్యంకు పెళ్ళిచేసుకునే అర్హత లేదా?'

'కులం గోత్రం ఊరుపేరులేని ఒక అనాథబిడ్డని ఎవరు పెండ్లిచేసుకో డానికి సిద్ధమౌతారు? అదీకాక ఆ రాజమ్మ సిసింద్రీడిప్పకాయ! సీమ మిరపకాయ! దాన్ని ఇక్కడవాళ్ళంతా 'సీమటపాకాయ్!' అని పిలుస్తారు.

'ఆ బిరుదులు ఇవ్వటానికి కారణమేమిటో?' అనుమానంగా అడిగాడు.

'దానికో సరదా, చట్టుబండలు, నవ్వులు ఏమీలేవు. ఎవరైనా వేళాకోళంగా ఏమాటైనా అంటే చెంప ఛెళ్ళుమనిపించటమే తెల్సు దానికి. అందుకే ఆ రాజమ్మ పేరుచెబితే ఎవరూ దానిప్రక్కని పనికి నిల్చోరు...'

'ఓహో! అదా సంగతి?' అని నవ్వాడు రమేశు.

'నువ్వు దాన్ని పల్కరించకు సుమా? చిన్నప్పుడు పలకతో కొట్టిందికాని, ఇప్పుడు గొడ్డపారతోకూడా కొట్టేంత సాహసికురాలు' అని హెచ్చరించాడు నాగేంద్రం.

తండ్రికొడుకూ ఇల్లుచేరారు. నాగేంద్రం స్నానం చెయ్యటానికి పెరట్లోకి వెళ్ళిపోయాడు. రమేశుకి ఏమీ తోచక రాజమ్మ ఇంటివైపుకి నడిచాడు.

'రాజ్యం!' అని నెమ్మదిగా పిల్చాడు రమేశం.

కిరసనాయిలు దీపంబుడ్డి చేత్తో పట్టుకువచ్చి రాజమ్మ తలుపు తెరచింది. ఎదురుగా రమేశం! ఆశ్చర్యం ఆనందం ఆవేశంతో ఇద్దరికీ ఉక్కిరిబిక్కిరి అయినట్లయింది. 'రమేశూ!' అంది అప్రయత్నంగా రాజ్యం.

ఆనందంతో కాంతివంతంగా వున్న రాజీ ముఖారవిందాన్ని తనివితీరా ఆ దీపకాంతిలో చూస్తున్నాడు రమేశు. తనని త్రాగుతూన్నట్లు చూచే రమేశుని చూచేసరికి సిగ్గు ముంచుకొచ్చింది రాజీకి. 'రమేశ్! నువ్వు మా యింటికి వచ్చినట్లు మీ అమ్మ నాన్నకి తెలిస్తే ఇంక నీపని...' కిలకిలా నవ్వేసింది.

'రాజీ! నీతో ఒకమాట చెప్పాలని వచ్చాను. మరి రావా?'

'రమేష్! నాకీ లోకంలోని పురుషజాతిమీదే అసహ్యత కల్గింది. అందుకే నే నెవ్వరితోనూ మాట్లాడ్డం మానేశాను. కాని...'

'రాజ్యం! క్షణకాలం నాకా అవకాశం కల్గించమని మిత్రునిగా వేడుకొంటున్నా. రాజీ! నిన్ను నేను తల్చుకోని రోజులేదు—'

'రమేష్! అమ్మలోపల వుంది. ఆ చెప్పదల్చుకున్నదేదో త్వరగా చెప్పెయ్!'

'ఒక్కసారి ఇల్లావచ్చి కూర్చోరాజా! ఇంతలో నిన్నేం అవమానించనులే! నేనంత క్రూరుణ్ణికాదు'

'ఇక్కడే ఆ మాటేదో చెప్పకూడదా రమేశ్! నువ్వు శ్రీమంతుడివి. మీతండ్రి—' రాజీకి అప్పుడే నాగేంద్రం గుర్తుకి వచ్చేసరికి ఆగ్రహం అరవై పాళ్ళు,

తనవైపు కోరచూపులు చూచే కూలీలను తల్చుకొనేసరికి ఈర్ష్య ఇరవైపాళ్లు, ఎదుటనున్న రమేశ్ చెప్పేమాట యేదో తెమల్చడంలేదని విసుగు పదిపాళ్ళు పెరిగిపోయింది. ఇంక రమేశ్‌ని గుమ్మంలోనే విడిచి లోపలికి వెళ్ళిపోదామని చిరాగ్గా వెనక్కి తిరిగింది రాజీ. కాని అంతలోనే రమేశ్ ఆమె వెనక్కాలేవచ్చి 'హుష్'మని ఊది ఆమెచేతిలోని దీపం ఆర్పివేసి చెయ్యి పట్టుకొన్నాడు. ఆరాటంతో అట్టుడికిపోతోన్న రాజీకోపం ఆత్మ 'ఐస్'లా అయిపోయింది అతని హస్తస్పర్శకి.

'ఒక్కసారి ఇల్లారా రాజీ!' అంటూ చీకట్లో ఆమెను నడిపించాడు రమేశ్.

'రాజ్యం! కొన్నిక్షణాలు ఈ గున్నమామిడి చెట్టు క్రింద కూర్చుందాం [illegible]!' అని తను కూర్చుని రాజీని తన ఒళ్ళో కూర్చోబెట్టుకొన్నాడు. అతనిమాటకి అడుగు దాటకుండా అల్లాగే కూర్చుంది రాజీ.

రాజీ భుజంమీద చేతులువేసి 'రాజ్యం! నీకీ లోకం మీద, పురుషులమీద ఎందుకింత అసహ్యం? వాళ్లు నీకేం అపకారంచేసారు?' అన్నాడు మృదువుగా రమేశ్.

'రమేశ్! అందుకు చాలా కారణాలున్నాయ్. ఇప్పుడెందుకు?'




'రాజీ! నాతో చెప్పకూడదా? నిన్ను నా ఆత్మీయ మిత్రురాలిగా భావిస్తున్నా! నీకోసం ఈనాడు...'

'వద్దు రమేశ్! వద్దు' నువ్వేమీ చెప్పొద్దు! నీ మన స్తత్వం నాకు పూర్తిగా తెల్సు!—మా అమ్మను ఒక యువకుడు ప్రేమించి పెళ్ళిచేసుకొంటానని మాటయిచ్చి ఆమెతో తను స్వేచ్ఛావిహారం చేసాడు. అందుకు ప్రతి ఫలమే నేను! కాని ఆ యువకుని తల్లి ఈ వివాహానికి అంగీకరించలేదు. ఆతడు మా అమ్మను గర్భిణీతో వుండ గానే వదలి ఎక్కడికో వెళ్ళిపోయి తల్లి అనుమతి ప్రకారం పెళ్ళిచేసుకొన్నాడు. మాఅమ్మ కన్యాత్వంలో ఆ యువకునికోసం సర్వం త్యజించుకు వచ్చేసింది. చిట్ట చివరకు నమ్మినప్రియుడు చెప్పకుండా ఎటో పారి పోయాడు. లోకులు కాకులయ్యారు. నేను పుట్టేవరకూ ఆతడు వస్తాడేమోనని నిరీక్షించింది. కాని...కాని ఆ యువకుడైన (నాతండ్రి) వానిజాడే లేదు మూడు వసం తాలు నిరీక్షించి చివరకు నన్నుతీసుకు మీ యింటికివచ్చి తనెవరో చెప్పకోకుండా అజ్ఞాతంగా వుంటోంది అమ్మ! అందుకే నాకు యువకుల్నిచూస్తే అసహ్యం! చిన్న తనంలో నీవల్ల నాకు స్నేహానికే దెబ్బతగిలి పురుషజాతి మీదే ఏవగింపుకల్గింది రమేశ్! ఏం చెయ్యను?...'

'రాజీ! మానవుల్ని మానవులుగా చూడగలిగిననాడే మానవత్వ మనిపించుకొంటుంది ... రాజ్యం! అవన్నీ ఇప్పుడెందుకులే! ఒక్కమాటడుగుతాను. నిజం చెబు తావా?—నేనంటే నీ కిష్టముందా? లేదా?'

'రమేశ్! ఏమిటీ ప్రశ్న? ఇష్టమున్నంతమాత్రంచేత ఏమిటి ప్రయోజనం?'

'ఉంది! అసలు నిజంగా నామీద నీకు అభిమానం ప్రేమ వుందా?'

రాజ్యం తనచెంపను ఆతని భుజానికి ఆదించి 'రమేశ్! ఈ ప్రపంచంలో నా కిష్టమైనవాడివి; నా ఆత్మీయు డవు నువ్వొక్కడవే!'

'రాజీ! నిజంగానా? నన్ను నీవానిలా భావిస్తు న్నావా?' అంటూ ఆమెను తన హృదయానికి హత్తు కొన్నాడు రమేశ్.

రాజ్యం సిగ్గుతో ఆతని వక్షంపై వాలిపోయింది. అల్లా ఆ ఆనంద కెరటాల్లో వారెంతసేపు వున్నారో!...

'అమ్మాయ్! రాజా ఎక్కడే?' అన్న రత్తమ్మ స్వరం విన్పించింది.

రమేష్ చెయ్యిపట్టుకుని లేచింది రాజీ. రాజీని విడువ లేక గట్టిగా గుండెకి హత్తుకొన్నాడు రమేశ్. తల్లి ఇటేరావటం గమనించిన రాజ్యం అతన్ని విడువక తప్ప లేదు. రమేశ్ ఆనందంతో ఇంటిదారి పట్టాడు.

(సశేషం)


## కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]


స్థాపితము 1938.

విడి ప్రతి. — 25 న. పై

సంవత్సర చందా. — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గింబాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్ లలోనూ దొరుకును.

# తరంగాలు

రచన:

శ్రీమతి పఠానేని శ్రీ శైల భ్రమరాంబ

(గత సంచిక తరువాయి)

రాత్రంతా పూరిగుడిసెలోని రాజ్యం; మేడ మీద గదిలోవున్న రమేశ్ తీయని కలల్లో తేలిపోయారు.

తెల్లవారింది!

ఇల్లంతా హడావిడి! ప్రొద్దున్నే తెల్లవారే సరికి పెండ్లి ఇల్లులా అలంకరించారు - రమేష్ నిద్రనుంచి లేచి మేడ దిగి వస్తూంటే "రమేశం! ఇవ్వాళ హైద్రాబాదు నుంచి మీ మామయ్య వస్తున్నాడు! ఒక పెళ్లి సంబంధం తీసుకు వస్తున్నాడు!! పెళ్లికూతురు ఆ పిల్ల తల్లి తండ్రులతో సహా వస్తూన్నట్లు టెలిగ్రాం వచ్చింది!!!" అన్నాడు సంతోషంతో నాగేంద్రం.

రమేశ్ నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది. తన బ్రతుకింక అగాధంలో పడిపోతుందేమోనని ఆవేదనతో ఒక్కసారిగా కూలిపోయాడు -

"త్వరగా రారా రమేశం! మామయ్య వాళ్లు వచ్చే వేళయిపోయింది. నువ్వు స్నానం చేసి ముస్తాబు అయి కూర్చో..." తల్లి తొందరచేసింది.

"నాకిప్పుడీ పెళ్లి వద్దు" అని చెప్పాలనుకొన్నాడు రమేశ్ - కాని నోరెత్తి మాట్లాడ్డానికి కూడా అవకాశమివ్వకుండా రమేశుని ముస్తాబు చేసి పెళ్లికొడుకు చూపులకై కుర్చీలో కూర్చోబెట్టారు.

రమేశ్ మేనమామ హైద్రాబాదులో పెద్ద వకీలు - కోటీశ్వరుడు - ఆ వకీలుగారి మాటకి ఏ మానవుడూ ఎదురు జవాబివ్వలేడు - అన్ని విధాలా రమేశుకి అనుకూలమైన యం. ఎ. చదువుకొన్న శ్రీమంతుల అమ్మాయిని తీసుకువస్తున్నాడు. ఈ సంబంధం అందరికీ ఇష్టమే! ఇంక రమేశుకి చూపించి పెళ్లి తాంబూలాలు పుచ్చుకోవటానికే ఈ రాక! ఆ వధువు, ఆమె తల్లి తండ్రులూ రమేశు మేనమామ శేఖరం కల్సివస్తున్నారు. రమేశు మనస్సులో రాజీ వెయ్యి రూపాల్లో కన్పిస్తోంది!

గుమ్మంలో కారాగింది. నాగేంద్రం, భూదేవి ఎదురు వెళ్లి పెళ్లివారిని ఆహ్వానించి లోనికి తీసుకు వచ్చారు - శేఖరం కూడా ఈ యింటికి వచ్చి ఇరవై ఏళ్లయింది - ఇన్నాళ్లకి తమ యింటికి ఈ పెళ్లి సంబంధం కోసం వచ్చిన భావమరిదిని చూచి ఆనందంతో ఉప్పొంగిపోయాడు నాగేంద్రం - మామయ్యని చూస్తే రమేశంకు హడల్ - మేనమామ ముందు రమేశం ఒక బొమ్మ! ఏమీ ఎదిరించలేడు. మరి తన మనస్సులోని రాజీ! ...

అందరికీ కాఫీ టిఫిన్లు పూర్తయ్యాయ్. పెళ్లి మాటల్లోకి దిగారు - అమ్మాయికి ఆమె తల్లి తండ్రులకీ రమేశ్ నచ్చాడు - నాగేంద్రం భూదేవి కూడా కాబోయే కోడల్ని చూచి ఉప్పొంగిపోయారు - వధువు అందంగానే వుంటుంది - ఏవిధమైనా వంకా ఎంచటానికి కనిపించడంలేదు రమేశంకు.

"రమేశం! అమ్మాయి నీకు నచ్చినట్లేనా?..." అడిగాడు మేనమామ. భయంతో మౌనం వహించాడు రమేశం - హృదయంలో బాధ, దుఃఖం ఆవేదన పొంగుకొస్తూన్నా నోటంట రాజీ మాట ఎత్త లేకపోతున్నాడు -

"అదుగో! పురోహితులవారు కూడా వచ్చారు. ఇంక పెళ్లి తాంబూలాలు పుచ్చుకొందాం!" అన్నాడు నాగేంద్రం సంతోషంగా -

"నాన్నగారూ! నాకిప్పుడు పెళ్ళి చేసుకోవాలని లేదు" ఎల్లాగో అతి కష్టం మీద అన్నాడు రమేశం -

శేఖరం చిరునవ్వుతో "పెళ్లి తాంబూలాలు పుచ్చుకొని మిమ్మల్ని దంపతులుగా ఖాయంచేసి మేము వెళ్లిపోతామే కాని అప్పుడే పెళ్లి చెయ్యడం లేదోయ్!..."

"నే...ను...అసలు... పెళ్లి ... చేసుకోను" నములుతూ మ్రింగుతూ అన్నాడు రమేశం.

ఆ మాటవినేసరికి శేఖరం తోకత్రొక్కిన త్రాచులా ఖస్సున లేచాడు. "రమేశ్! నన్ను అవమానించడానికా ఇంత దూరం నీ యింటికి రప్పించారు? నీ తల్లి తండ్రి నా యింటికి వచ్చి పిల్ల నచ్చిందనీ, నిన్ను ఇక్కడికి రప్పిస్తామనీ, కన్యాదాతలు కూడా అన్నీ స్వయంగా చూడవచ్చుననీ పదే పదే చెప్పడంతో నేనెంతో ప్రయాస మీద తీరిక చేసుకుని వీరిని వెంట పెట్టుకువస్తే, చివరకు నువ్వు ఇల్లా అంటావా? ఇదేనా మర్యాద?"

"నేనొక అమ్మాయిని మనసారా ప్రేమించాను. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను -

కాని...ఇంట్లో జరిగే ఈ ప్రయత్నాలేమీ నాకు తెలియవు." నెమ్మదిగా అన్నాడు రమేశం -

"ఎవరురా నువ్వు ప్రేమించే అమ్మాయి" గద్దించి అడిగాడు నాగేంద్రం.

"రాజ్యం"

క్షణంలో నాగేంద్రం, భూదేవి ముఖాలు కోపంతో వికృతంగా మారిపోయాయి. కొడుకుని అనరాని దుర్భాషలన్నారు. ఆవేశంలో వారి నోటంట ఏమొస్తోందో కూడా తెల్సుకోలేని స్థితిలో కొడుకుని నానా మాటలూ దులిపేశారు - చివరకి "నువ్వు నా కొడుకువి అని అనుకొంటే ఈ పెళ్లి చేసుకొని మమ్మల్ని సంతోషపెట్టు - లేదంటే నీకూ మాకూ ఋణం తీరి పోయినట్లే..."

"......" మౌనం వహించాడు రమేశం.

"రమేశ్! నీ మనస్సు మార్చుకోలేవా?" అన్నాడు మేనమామ.

"......"

"ఇరవై సంవత్సరాల అనంతరం ఈ గుమ్మం నా పరువు ప్రతిష్ట పోగొట్టుకొందుకు త్రొక్కాల్సివచ్చింది- ఇదే ఇంక చివరిసారి రావడం...రండి పోదాం!..." అని లేచాడు శేఖరం. ఆయనతో బాటే మిగతా ముగ్గురూ లేచారు - వారి వెనకాల పురోహితుడు దోవ తీశాడు -

వీధి గుమ్మం దిగిబోతున్నాడు శేఖరం -

రత్తమ్మ-కూతురు కల్సి గుమ్మానెక్క బోతున్నారు. రాజమ్మను చూచిన రమేశం హాలులో నుంచి వీధి అరగు మీదకి వచ్చాడు - రత్తమ్మ ముఖం చూచిన శేఖరం సడన్ బ్రేక్ వేసినట్లు తక్కున ఆగిపోయాడు.

"శేఖర్!" అంది రత్తమ్మ.

"రత్నావతీ! నువ్వా?!! బాగున్నావా?!!!" అన్నాడు శేఖర్ ఎంతో నెమ్మదిగా.

"శేఖర్! నీ బిడ్డని నీ కప్పగించే వరకూ సజీవంగా వుండక తప్పుతుందా?..." హృదయాన్ని చీల్చుకొని ఆవేదనతో అంది రత్తమ్మ.

"ఏదీ మన బిడ్డ?" ఆతృతగా అడిగాడు.

"ఇదుగో! ఆ నాడు పీఠికాపుర రాజరాజేశ్వరీ సన్నిధానంలో మనం దంపతులుగా ప్రణమిల్లాం! ఆ దేవి కరుణా కటాక్షంగా నీ ప్రతిరూపమే ఈ రాజేశ్వరి! ఈ బిడ్డని తండ్రివైన నీకు ఒప్పగించి ఈ ల[illegible]ం నుంచి, నీ నుంచి శలవు తీసుకోవాలని చూస్తున్నా. శేఖర్! నీ బిడ్డ తండ్రి ఏడి? అని అడుగుతూంటే... నేనెంతగా విలపించేదాన్నో?..." వలవలా కన్నీరు కారుస్తూ అంది రత్తమ్మ.

"రత్నావతీ! నన్ను క్షమించు!! నీకు తీరని ద్రోహం చేసిన కఠినుణ్ణి!!! అంటూ ఆమె రెండు చేతులూ పట్టుకొన్నాడు శేఖరం.

అందరూ ఆశ్చర్యంగా శిలాప్రతిమల్లా నిల్చుండిపోయారు.

"రాజా! మీ నాన్నగారు వీరేనమ్మా! ఇన్నాళ్లూ వీరికి నిన్ను ఒప్పగించటానికే నేను బ్రతకాల్సి వచ్చింది తల్లీ!"

"అమ్మా!" అంది అర్థంగాని అయోమయంగా రాజ్యం.

'ఇదుగో మీ కూతురు రాజ్యం! మన ప్రేమచిహ్నంగా ఈ చిన్నారి బిడ్డని మీకిస్తున్నా!! నాకు శలవు.!!!' అని రాజీ చేతులు శేఖరం చేతుల్లో పెట్టి రెండడుగులు వెనక్కి వేసింది రత్తమ్మ.

'రత్నావతీ! ఆ నాడు కన్నతల్లి మాటను కాదనలేక నిండు చూలాలివైన నిన్ను వదలి వంచకుడనై పారిపోయాను. కన్నతల్లి కఠిన శాసనప్రకారం కళ్యాణం చేసుకున్నాను - కాని... నువ్వు కార్చిన కన్నీటి ఫలితం ఊరికే పోతుందా? వృద్ధురాలైన నా మాతృదేవత అంతరించింది - నన్నెంతో ఆనందింపజేసే నా అర్ధాంగి కూడా ప్రసవించలేక ఈ లోకాన్ని వదిలింది - ఆ నాటి నుంచీ చనిపోయిన యిల్లాలికోసం, బ్రతికిన ప్రేయిసి కోసం కన్నీరు కారుస్తూ కఠిన బ్రహ్మచర్యం వహించాను; ఈ నాటికి దైవం మనల్ని కరుణించాడు - నా భార్యనీ, బిడ్డనీ నాకిచ్చాడు...

'శేఖర్! నిజమేనా?!! ఇదంతా నిజంగానే చెబుతున్నావా?!!! సూటిగా చూస్తూ అడిగింది రత్తమ్మ.

'రత్నావతీ! దైవంమీద ప్రమాణంచేసి చెబుతున్నా- ఇంక నిన్నూ-నన్నూ ఏ దేముడూ విడదియ్యలేడు! ఇంక నా బిడ్డకి ఏ కొరతా రానివ్వను.' అంటూ రాజ్యంను పితృ వాత్సల్యంతో గుండెకు హత్తుకొని ఆమె కపోలాన్ని చేతుల్తో నిమిరాడు తనివితీరా శేఖరం.

'నాన్నా!' అప్రయత్నంగా అనేసింది రాజ్యం.

'అమ్మా! నీతండ్రి కిరాత కృత్యానికి అసహ్యించుకొంటున్నావా అమ్మా!... నీచేత నాన్నా! అనిపించుకునే అదృష్టాన్ని నాటికి పొందగలిగినందుకు ధన్యుణ్ణి తల్లీ!...' అంటుండగానే శేఖరం కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

'శేఖరంగారూ! మీరు —' ఏదో అనబోయాడు ఆయనతో వచ్చిన వధువు తండ్రి.

'ఈమె నా భార్య రత్నావతి. ఈ అమ్మాయి నా కూతురు రాజేశ్వరి. ఇన్నాళ్లూ భార్యా బిడ్డ ఎక్కడున్నారో తెలియక మనస్సులో కుమిలి పోయేవాణ్ణి. ఇన్నాళ్ళకి నా గృహలక్ష్మి కనిపించింది.' అన్నాడు సంతృప్తిగా నిట్టూరుస్తూ శేఖరం.

'మామయ్యా! నేను పెళ్ళాడబోయే 'రాజీ' ఇప్పుడు మేనమామ కూతురేనన్నమాట!' అన్నాడు ఖుషీగా రమేశం.

'అల్లుడూ! మా అమ్మాయి అంత తొందరగా నీ చేతికి చిక్కుతుందనుకొంటున్నావా?...' మీ నాన్న ఇంతకు ముందు అన్న మాటలకి ముక్కుకి తాడేసి మూడు కోర్టులూ తిప్పించి నా లాయరు హోదా చూపించకుండా నీకు మా అమ్మాయి నిస్తాననుకొన్నావా రమేశం...' అంటూ నవ్వాడు.

'రత్తమ్మా! ఇన్నాళ్లూ కొంచెం మాటైనా చెప్పావు కావేం?' అన్నాడు నాగేంద్రం.

'మీరు మీ బావమరిదిగారని నాకు తెలియదు బాబయ్యగారూ! అంది వినయంగా రత్తమ్మ.

'రత్నావతీ! ఇంక ఆ పెద్దపెద్ద మన్ననలు తీసెయ్! ఆయన ఒక భూఖామందు. అయితే నువ్వు హైకోర్టు వకీలు అర్ధాంగివి-కాబోయ్యే వియ్యపురాలివి, కోటీశ్వరునికి యిల్లాలివి—రా మనింటికి పోదాం!! అమ్మా రాజ్యం కారెక్కమ్మా!!!' అంటూ భార్యనీ కూతుర్నీ చెరో చేత్తోనూ పట్టుకొన్నాడు శేఖరం.

'అన్నయ్యా! ఇప్పుడెక్కడికి వెడ్తావ్? నాల్గురోజులుంటేకాని వెళ్ళనిచ్చేదిలేదు... రాజమ్మా! నువ్వయినా చెప్పి అమ్మనీ నాన్ననీ ఆపమ్మా!' అంది భూదేవి.

'అబ్బో! అప్పుడే అత్తగారి అధికారం చూపిస్తున్నావా?' అన్నాడు చిరునవ్వుతో శేఖరం.

'శేఖరంగారూ! ముహూర్తంకు ఇంక పావుగంట వ్యవధివుంది. మీరూ నాగేంద్రంగారూ అనుకున్నమాట తప్పిపోకుండా, ఆధూవరుల మనస్సు నొచ్చుకోకుండా పెళ్ళి తాంబూలం పుచ్చుకొని మాకు సంభావన ఇప్పించండి' అన్నాడు పురోహితుడు.

రాజీ-రమేశ్‌లు ఒకరినొకరు చూచుకొని నవ్వుకొన్నారు.

వియ్యంకులైన నాగేంద్రం శేఖరం తాంబూలాలు పుచ్చుకొన్నారు-రత్నావతి(రత్తమ్మ)ని చీని చీనాంబరాలతో అలంకరించింది భూదేవి-

వారింట్లో వేయి దీపావళీ పండుగల ఆనందదినం సముద్ర కెరటాల్లా వెల్లివిరిసిపోయింది. అందరి వదనాల్లోనూ - మరుపురాని మధుర దీపావళియై నిల్చింది ఆయింట పండుగ-

*

---

భర్త: నువ్వు నన్ను పెళ్లి చేసుకుంటున్నప్పుడు - ఒక బ్యాంక్ గుమాస్తాను పెళ్లాడుతున్నావని తెలుసునా?

భార్య: తెలుసు - ఎందుకు?

భర్త: ఏమీ లేదు, నువ్వో బ్యాంకునే పెళ్లి చేసుకుంటున్నావని అనుకున్నావేమో అని!

— దశరథరాజు, బందరు.

* * * *

డైరెక్టరు: యిదిగో! మీరీ చిత్రంలో ప్రధాన పాత్ర నిర్వహించాలి జాగ్రత్త సుమా?

యాక్టరు: అయితే ఏమి చేయమంటారు?

డైరెక్టరు: విగ్గెట్టుకొని, ఫేసుపౌడరు దవడల కొట్టుకున్నావా?

యాక్టరు: మీరు డబ్బీయకపోతే చివరకా పనైనా పూర్తి చేస్తాను.

— ఎం. విశ్వనాథశాస్త్రి కర్నూల్.